క్లుప్తంగా

పూజారికి జాతీయ స్థాయి చతుర్ముఖ సింహ అవార్డు


అవార్డు అందుకుంటున్న రజనీకాంత్ ఆచార్య

చిలుకూరు : మండల కేంద్రంలోని కాలువ ఒడ్డున గల అభయాంజనేయ స్వామి ఆలయ పూజారి రజనీకాంత్ ఆచార్యకు జాతీయ స్థాయి చతుర్ముఖ సింహ అవార్డు లభించింది. కరీంనగర్‌లో శ్రీ ఆర్యాణి సకల కళా వేదిక, శ్రీ గైతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థల వారు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ సాహితీ, సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీ దూడపాక శ్రీధర్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. రచయిత, కవి, గాయకుడు, కళాకారుడు, ఆర్టిస్ట్, తెలుగు, సంస్కృతం అధ్యాపకులు, సాహితీ, సామాజిక రంగంలో నైపుణ్యం ఉన్నందున తనను గుర్తించి ఈ అవార్డు అందజేసినట్లు రజనీకాంత్ ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా పూజారిని చిలుకూరు గ్రామస్తులు అభినందించారు.

మెడికల్ షాప్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా సుమన్


సుమన్‌ను సన్మానిస్తున్న సభ్యులు

మునగాల : మెడికల్ షాప్స్ అసోసియేషన్ మునగాల మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన అమరగాని సుమన్ ఎన్నికయ్యారు. ఆదివారం మునగాలలో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సుమన్‌ను సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మెడికల్ షాప్స్ అసోసియేషన్ సభ్యులు కాసర్ల నారాయణ, మండవ శ్రీనివాస్, శ్రీను, రామకృష్ణ, లేళ్ల మధు, అనిల్, అజయ్, మండవ వినోద్, సంగెపు ఉపేందర్ పాల్గొన్నారు.

రజక సంఘం మండల అధ్యక్షుడిగా నర్సయ్య



నియామకపత్రం అందజేస్తున్న లక్ష్మయ్య

గరిడేపల్లి : రజక సంఘం గరిడేపల్లి మండల అధ్యక్షుడిగా మండలంలోని తాళ్లమల్కాపురం గ్రామానికి చెందిన కోమరాజు నర్సయ్య నియమితులయ్యారు. ఈమేరకు ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కోమరాజు లక్ష్మయ్య ఆదివారం నర్సయ్యకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో కోమరాజు వెంకటేశ్వర్లు, నరేష్, గోపాలం, రాములు, అంజయ్య, నాగరాజు, సైదులు, రామకృష్ణ, వెంకన్న, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామి ఆలయంలో ఉద్వాసన పూజలు

మోతె : మండలంలోని ఉర్లుగొండ గ్రామంలో గౌడ కులస్తుల కుల దైవమైన శ్రీ కంఠమహేశ్వరస్వామి, సురమాంబ, ఎల్లమ్మతల్లి, వన మైసమ్మ దేవతల విగ్రహాల పునఃప్రతిష్ఠ నిమిత్తం ఆదివారం ములుగూరి అంజయ్య ఆధ్వర్యంలో ఉద్వాసన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉర్లుగొండ గౌడ కులస్తుల సంఘం అధ్యక్షుడు కాంపాటి వెంకన్న గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేయాలి


మాట్లాడుతున్న శ్రీను

నేరేడుచర్ల : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సిరికొండ శ్రీను కోరారు. ఆదివారం నేరేడుచర్ల మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలో గల ఓంకార్ భవనంలో జరిగిన సీపీఎం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేటలో ఈనెల 29న జరిగే సీపీఎం బహిరంగ సభ, ఈనెల 30, డిసెంబర్ 1న జరగబోయే ప్రతినిధుల మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు మర్రి నాగేశ్వర్‌రావు, సోమయ్య, నాగసైదులు, మధుబాబు, అప్పారావు, వెంకటయ్య, శ్రీధర్, రాణెమ్మ, రాములమ్మ, సైదులు ఉన్నారు.

రామాలయంలో పూజలు

నడిగూడెం : కార్తీక మాసం సందర్భంగా ఆదివారం నడిగూడెం మండల కేంద్రంలోని శ్రీకోదండరామస్వామి ఆలయం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భవిరిశెట్టి వెంకటరత్నం, ఆలయ పూజారి వరదాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

డొంక దారి.. ఇరుకుగా మారి

చిలుకూరు : మండలంలోని కొమ్ముబండతండా నుంచి ఆచార్యులగూడెం వెళ్లే డొంక దారి ఆక్రమణకు గురై ఇరుకుగా మారింది. సుమారు 2 కిలీమీటర్లు ఉన్న ఈ డొంక రోడ్డు గుండా కొమ్ముబండతండా, ఆచార్యులగూడెం, జెర్రిపోతులగూడెం గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఉండడంతో వారు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దారిని ఇరుపక్కల రైతులు ఆక్రమించడంతో ఇరుకుగా మారి ధాన్యం ట్రాక్టర్లు ప్రమాదాలకు గురవుతున్నాయి. గత వారం రోజుల్లో రెండు ట్రాక్టర్లు అదుపుతప్పి కింద పడి ధాన్యం నేలపాలైంది. ప్రస్తుతం వరి కోతలు జరుగుతుండడంతో వరి కోత మిషన్లు ఆ రోడ్డులో వెళ్తే ఎదురుగా వాహనాలు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి డొంక రోడ్డును సర్వే చేసి ఆక్రమణలు తొలగించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని పలువురు రైతులు కోరుతున్నారు.


కొమ్ముబండతండా - ఆచార్యులగూడెం డొంక దారిలో మూడు రోజుల క్రితం అదుపుతప్పి పొలంలో పడిపోయిన ధాన్యం ట్రాక్టర్

మందుబాబులకు అడ్డాగా ప్రాథమిక పాఠశాల!

నడిగూడెం : మండలంలోని కాగితరామచంద్రాపురంలో గల ప్రాథమిక పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. గత కొద్ది రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల వరండాలో మద్యం సేవించి, ఆ మద్యం సీసాలను అక్కడే పగులగొట్టి వెళ్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మందుబాబులపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పాఠశాల వరండాలో పగులగొట్టిన మద్యం సీసాలు

ఆదర్శ వివాహానికి హాజరైన ఎమ్మెల్యేలు


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యేలు వేముల వీరేశం, లక్ష్మారెడ్డి

మోతె : మండలంలోని మామిళ్లగూడెంలో గల సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన నూకల రాంరెడ్డి –ఉపేంద్ర దంపతుల కుమారుడు నూకల మహేష్‌రెడ్డి ఆదర్శ వివాహం చేసుకున్నాడు. ఈ ఆదర్శ వివాహానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడెం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నేరేడుచర్ల : రాష్ట్రంలో మున్నూరు కాపుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.3 వేల కోట్ల నిధులు కేటాయించాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లెపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం నేరేడుచర్ల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన తెలంగాణ మున్నూరు కాపు వన సమారాధన మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో మున్నూరు కాపులు ప్రధాన భూమిక పోషించారని తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో మున్నూరు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిందని, స్థానిక సంస్థల ఎన్నికలలోపు కార్పొరేటషన్ ఏర్పాటు చేయకపోతే కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతామన్నారు. ప్రతి జిల్లాలో సంఘం భవన నిర్మాణానికి రెండు ఎకరాల భూమి, రెండు కోట్ల రూపాయలను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించినప్పటికీ నేటికీ ఆ హామీ అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో సంఘం లీగల్ సెల్ అధ్యక్షుడు రఘు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ధనుంజయ నాయుడు, ఉపాధ్యక్షుడు బాల వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు అంబటి నాగేశ్వర్‌రావు, తేరాల వెంకటేశ్వర్లు, సురేష్ తదితరులు ఉన్నారు.


వన సమారాధనలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కోదాడ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

కోదాడరూరల్ : కోదాడ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేసుకుంటూ ముందుకెళ్తున్నామని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. మండలంలోని గణపవరం స్టేజీ నుంచి గ్రామంలోకి ఎంఆర్ఆర్ నిధులు రూ.50 లక్షలు, గణపవరం నుంచి ఎర్రవరం రోడ్డు వరకు సీఆర్ఆర్ నిధులు రూ.84 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు ఆదివారం ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు బీటీ రోడ్లతో పాటు మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, పీఆర్ ఏఈ రాము, జాబిశెట్టి ప్రసాద్, సింగారెడ్డి సుమన్‌రెడ్డి, నారపరెడ్డి, లక్ష్మారెడ్డి, నర్సింహారావు, చిన్న కోటయ్య, సత్యం ఉన్నారు.

నిఖార్సయిన తెలంగాణవాది లక్ష్మణ్‌బాపూజీ

కోదాడ : తెలంగాణ కోసం తన పదవులను తృణప్రాయంగా త్యాగం చేసిన నిఖార్సయిన తెలంగాణవాది కొండా లక్ష్మణ్‌బాపూజీ అని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి కోరారు. కోదాడ పట్టణంలోని స్వాతి థియేటర్ వద్ద జాతీయ రహదారిపై పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని ఆదివారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన పద్మశాలి సేవా సంఘం సభ్యులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, పద్మశాలి సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి సంగిశెట్టి గోపాల్, కొంగర నరసింహారావు, పొడుగు హుస్సేన్, నక్కా చంద్రం, నాగరాజు, పిండిప్రోలు శ్రీను తదితరులు పాల్గొన్నారు.


కోదాడ : కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తా

కోదాడరూరల్ : కుల సంఘాల అభివృద్ధి, సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. కార్తీకమాసం చివరి ఆదివారం సందర్భంగా కోదాడ పట్టణంలో గౌడ, రజక, పెరిక, పద్మశాలి, ఆర్యవైశ్య, సర్వబ్రాహ్మణ కులస్తుల కార్తీక వనభోజన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ మహోత్సవంలో పలు చోట్ల ఎమ్మెల్యే పద్మావతి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పదోన్నతితో మరింత బాధ్యత పెరుగుతుంది

కోదాడరూరల్ : ఉద్యోగులకు పదోన్నతితో మరింత బాధ్యత పెరుగుతుందని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పదోన్నతి పొందిన మాదిగ ఉద్యోగుల సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు నిబద్ధతతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఎస్సీవర్గీకరణపై కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రిజర్వేషన్‌లపై చర్చిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటేశ్వర్లు, బీసీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బట్టు మల్లయ్య, ములుగూరి వెంకయ్య, మాతంగి మనోజ్, ఏపూరి పర్వతాలు తదితరులు ఉన్నారు.


కోదాడరూరల్ : బీటీరోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతి, తదితరులు


కోదాడరూరల్ : ఎమ్మెల్యే పద్మావతిని సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

ఆనందోత్సాహాలతో వన భోజన మహోత్సవం


నేరేడుచర్ల : జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కాకతీయ కమ్మ సంఘం నాయకులు


మఠంపల్లి : సమారాధనలో పాల్గొన్న ఆలయ అనువంశిక ధర్మకర్తలు, బ్రాహ్మణులు

నేరేడుచర్ల : పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన భోజన మహోత్సవాన్ని ఆనందోత్సాహాలతో నిర్వహించారు. నేరేడుచర్ల, పాలకీడు, గరిడేపల్లి మండలాలకు చెందిన కమ్మ సంఘం నాయకులు కుటుంబ సమేతంగా ఈ మహోత్సవంలో పాల్గొని ఆటా– పాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం సాముహికంగా భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు రావులపల్లి ప్రసాద్, చలసాని శ్రీనివాస్‌రావు, నాగండ్ల శ్రీధర్, పాతూరి శ్రీనివాస్, సుంకరి క్రాంతికుమార్, సుంకరి ప్రదీప్తి, నిమ్మలగడ్డ సుబ్బారావు, అన్నపూర్ణ, వల్లంపట్ల లచ్చయ్య, నామా సత్యనారాయణ, ప్రసాద్, రామారావు, సత్యనారాయణ, శేషగిరి, తిరుపతమ్మ ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

హుజూర్‌నగర్ : కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఆదివారం హుజూర్‌నగర్‌లో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామివ్రతం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యకక్రమంలో సంఘం నాయకులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

గౌడ కులస్తుల కార్తీక వన భోజనాలు

పట్టణంలోని పాత బజార్‌లో గల గౌడ కులస్తులు ఆదివారం కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి గుట్ట వద్ద గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, చిన్నారులకు క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కులపెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చిలుకూరులో..

చిలుకూరు : మండల కేంద్రంలో ఆదివారం గౌడ సంఘం కార్తీక వన భోజన మహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా గౌడ కులస్తులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులోని తోటలో ఉసిరి చెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని సత్యనారాయణ స్వామి వ్రతం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు అమరగాని కాశయ్య, గుండు వెంకటేశ్వర్లు, కడియాల వెంకటేశ్వర్లు, కొండా కోటయ్య, మండవ ఉపేందర్, కొండా వెంకయ్య, బెల్లంకొండనాగయ్య, మండవ అచ్చయ్య, మల్లం వెంకటేశ్వర్లు, మండవ వీరబాబు, కట్టెకోల లక్ష్మయ్య, అంబాల రాంబాబు, గౌడ కుటుంబసభ్యులు, ఉద్యోగులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల కార్తీక వన సమారాధన

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లిలోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో బ్రాహ్మణులు కార్తీక వన సమారాధనను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆట పాటలతో ఆనందంగా గడిపారు. సామూహికంగా భోజనాలు చేశారు. కార్యక్రమంలో మట్టపల్లి ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, బ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మణాచార్యులు, జోగాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిశర్మ, శేషగిరిరావు, అయ్యప్పాచార్యులు, సుబ్రహ్మణ్యం, సీతారామాచార్యులు, శ్రీకాంత్, వేద విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

బూరుగడ్డలో..

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో మంజూనాథ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు సామూహిక కార్తీక వన భోజన మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బుజ్జయ్య గురుస్వామి, సామాజిక కార్యకర్త ఆకుల రాము, లింగం, సైదులు తదితరులు పాల్గొన్నారు.


చిలుకూరులో వన భోజనాలకు వెళ్తున్న గౌడ కులస్తులు


చిలుకూరు : సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తున్న గౌడ కులస్తులు

రేపు ఎస్‌కేఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

కోదాడరూరల్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్తా కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో సూర్యాపేటలో ఈ నెల 26న జరిగే బైక్ ర్యాలీని జయప్రదం చేద్దామని ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ దొడ్డా వెంకటయ్య పిలుపునిచ్చారు. ఆదివారం కోదాడ పట్టణంలోని లాల్ బంగ్లాలో జరిగిన వామపక్ష, కార్మిక సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలకు చట్టబద్ధత కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతాంగ ఉద్యమంలో చనిపోయిన అమరవీరులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయొద్దని, ఉపాధీ హామి పనులను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాయపక్ష నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, వి.నరసింహారావు, బొల్లు ప్రసాద్, దేవరం వెంకటరెడ్డి, వీరాంజనేయులు, ముత్యాలు, ఉదయగిరి ఉన్నారు.

ఐకేపీ కేంద్రం పరిశీలన

మోతె : జిల్లా కేంద్రంలో ఈ నెల 26న ఐఎఫ్‌టీయూ, ఏఐకెఎంఎస్, అరుణోదయ సంస్కృతి సమైఖ్య ఆధ్వర్యంలో చేపట్టబోయే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల సైదులు కోరారు. ఆదివారం మండలంలోని రావిపహాడ్ గ్రామంలో ఆయన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం కార్మికులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను రద్దు చేయాలని, రైతులందరికీ పంట రుణమాఫీ చేయాలని, 200 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్‌చేస్తూ సూర్యాపేటలో ఈ నెల 26న నిర్వహించే బైక్ ర్యాలీకి రైతులు, కార్మికులు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచనపల్లి సైదులు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు కోట మధుసూదన్‌రెడ్డి, పాడపంగి ముత్తయ్య, నిమ్మల మల్లయ్య, నాగరాజు, జాన్‌పాష, రాంరెడ్డి, భవాణి, తదితరులు పాల్గొన్నారు.


కోదాడరూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న దొడ్డా వెంకటయ్య


మోతె : రావిపహాడ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని వీవీహైస్కూల్‌లో 1998– 99వ విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని గ్రీన్ మ్యాంగో ఫామ్ హౌస్‌లో సిల్వర్ జూబ్లీ కార్యక్రమం (ఆత్మీయ సమ్మేళనం) ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీడీఓ వల్లపుదాసు వెంకయ్య, గచ్చిబౌలి సీఐ రాంరెడ్డి, మధుబాబు, బాలాజీనాయక్, గౌస్‌పాషా, ప్రవీణ్, స్వాతి, సరిత, వాణి, మీరాబీ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

నేరేడుచర్ల : పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సాయి మణికంఠ జనరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో రెండు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ రావుల వెంకటేష్, కంటి వైద్య నిపుణుడు అనంత్‌నాగ్, దంత వైద్యురాలు ప్రియాంక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

మట్టపల్లి క్షేత్రంలో నిత్యారాధనలు


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం అర్చకులు నిత్యారాధనలు కొనసాగించారు. ఈ సందర్భంగా శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీప్రహ్లాదయోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామిని నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం నిత్యకల్యాణ తంతును అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న దాతలు, మాలధారులు

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప ఆలయం ఆవరణలో గల అన్నప్రసాద వితరణ కేంద్రంలో ఆదివారం 165 మంది అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనవాసచారి గురుస్వామి తెలిపారు. అన్నదానానికి మండల కేంద్రానికి చెందిన సూర్యప్రకాష్ –రమ్య దంపతులు(మునగాల), వల్లోజు వెంకటమ్మ కుమారుడు వెంకటకృష్ణ –జానకి దంపతులు(మునగాల), సారెడ్డి శ్రీనివాసరెడ్డి(మునగాల) సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

కౌలు వెంటనే చెల్లించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డ ఆలయ భూముల కౌలును కౌలు రైతులు వెంటనే చెల్లించాలని ఆలయ చైర్మన్ యరగాని గురవయ్య గౌడ్, ఈఓ ఎంపీ లక్ష్మణరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గతేడాది కౌలు రాకపోవడంతో ఆలయంలో నిత్య దూపదీప నైవేద్యం, ఉత్సవాలు, ఆలయ సిబ్బంది వేతనాలకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. గత ఏడాది, ఈ ఏడాదికి సంబంధించిన కౌలును వెంటనే చెల్లించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని రైతులను కోరారు.

చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

మఠంపల్లి : మండలంలోని అల్లీపురం, అంజలీపురం గ్రామాల్లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్ దగ్గుబాటి బాబురావు ఆధ్వర్యంలో ఆదివారం హలో మాల, చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1న నిర్వహించబోయే మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కోలపూడి వెంకయ్య, అల్లపురి శోభశ్రీనివాస్, నాయకులు జ్వానీస్, చినబాల శౌరి, విజయ, సౌజన్య, సుశీల, బాలు, రాజశేఖర్, రాజు, వినోద్, శైలజ, మీనా, జ్యోతి, చంద్రకళ, యశోద, నవ్య, నవనీతమ్మ, విక్టోరియా, సైదమ్మ, నీలమ్మ, వీరస్వామి, సుష్మ, రవిబాలు తదితరులు పాల్గొన్నారు.


అల్లీపురంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాల కులస్తులు

పైప్‌లైన్ లీకేజీతో అవస్థలు

నడిగూడెం : మండల కేంద్రంలోని ఏడవ వార్డులో తాగు నీటి పైపులైన్ దెబ్బతిన్నది. దీంతో నీరు లీకై రహదారిపైనే నిలుస్తోంది. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో పాటు నిల్వ నీటితో దుర్గంధం వెదజల్లుతోందని ఆ వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని అంటున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


బొడ్రాయి బజారులో రోడ్డుపై పారుతున్న నీరు